సాక్షి
పల్నాడు
గురువారం । 15 । జూన్ । 2023



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పట్నంబజారు: విద్యా కానుక కిట్లు అందించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం గుంటూరులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,300, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

ముఖేష్‌కు స్వర్ణం




గుంటూరు వెస్ట్ (క్రీడలు): నేషనల్ రైఫిల్ షూటింగ్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరుగుతున్న నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడని చీఫ్ కోచ్ ఎన్.సుబ్రమణ్యం తెలిపారు.

న్యూస్‌రీల్

23న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 23న నిర్వహించేందుకు జెడ్పీ సీఈవో జె.మోహనరావు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకు 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతోపాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అదే విధంగా 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.20 అడుగుల వద్ద ఉంది.

విక్రయానికి మిర్చి విత్తనాలు

గుంటూరు రూరల్: రైతుల కోసం లాంఫాంలో మిర్చి విత్తనాలు విక్రయానికి సిద్ధం చేశామని ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీఏ 657, 643 మిరప రకాలు ఫౌండేషన్ విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆసక్తిగల రైతులు నేరుగా ఉద్యాన పరిశోధన స్థానం లాంఫాంలో 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 4 గంటలలోపు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఒక రైతుకు 100 గ్రాములు మాత్రమే ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. 100 గ్రాముల ప్యాకెట్ ధర రూ.120 అని తెలిపారు. ఈ విత్తనాలు నారు పెంచుకుని నాటు వేసుకోవాలని తెలిపారు.

జోరుగా మిర్చి అమ్మకాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 50,407 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,994 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.9,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ప్రకత్యేక రకాల మిర్చికి రూ. 10,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,286 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఇంటర్ ఆర్ఐఓగా జుబేర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐఓగా జుబేర్ బాధ్యతలు స్వీకరించారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న జుబేర్‌ను ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలపై (ఎఎఫ్‌సీ) ఇంటర్మీడియెట్ బోర్డు నియమించింది. ఇప్పటి వరకు ఆర్ఐవోగా పని చేసిన జి.సునీత తిరిగి తన మాతృస్థానమైన గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు.

వెల్‌'సెట్‌'

ఏపీ ఈఏపీ సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా

- ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు కైవసం
- గుంటూరులో చదివిన నందిగామ విద్యార్థికి ఇంజినీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మెరుగైన ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో రాష్ట్ర స్థాయి టాప్-10తోపాటు 100లోపు ర్యాంకులను కై వసం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పిడుగురాళ్లకు చెందిన నందిపాటి సాయి దుర్గారెడ్డి 3వ ర్యాంకు, చిలకలూరిపేటకు చెందిన అడ్డగడ్డ వెంకట శివరామ్ 6వ ర్యాంకు, గుంటూరుకు చెందిన వై.మణీధర్‌రెడ్డి 7వ ర్యాంకు సాధించారు. గుంటూరులో చదివిన ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన చల్లా ఉమేష్ వరుణ్ రాష్ట్రస్థాయి ఫస్ట్ ర్యాంకు సాధించడం గర్వకారణం. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో తెనాలి విద్యార్థి దుర్గెంపూడి కార్తికేయరెడ్డికి 5వ ర్యాంకు లభించింది.

వందలోపు ర్యాంకులివీ..

ఇంజినీరింగ్‌లో వినుకొండకు చెందిన వెలమకన్ని సాత్విక్ 30వ ర్యాంకు, భట్టిప్రోలుకు చెందిన ఐనంపూడి హర్షిత 47, ఈసూరుకు చెందిన గూడూరు ఆదర్శ్ 53, గుంటూరులోని పట్టాభిపురానికి చెందిన నాదెళ్ల మోహిత్ సాయి 84, తాడేపల్లికి చెందిన దుగ్గిరాల యశస్విని 98, గుంటూరులోని వికాస్‌నగర్‌కు చెందిన గుంటి మురళీకృష్ణ 105, నవభారత్‌నగర్‌కు చెందిన ఆలోకం వరుణ్ 145, రేపల్లె విద్యార్థి ఎస్.వివేక్ వర్ధన్ 176, శ్రీకృష్ణదేవరాయ నగర్‌కు చెందిన వెలినేని హర్ష వైష్ణవ్ 207వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో గుంటూరులోని ఏటీ అగ్రహారానికి చెందిన డి.సాయి చిద్విలాస్‌రెడ్డి 19వ ర్యాంకు, పొన్నూరుకు చెందిన జి.అలేఖ్యదేవి 28, గుంటూరుకు చెందిన పి.రూపేష్ కుమార్ 52, మద్ది నాగ శ్రీఆదిత్య 55, మొగల్ షాజారున్నీసా 58, దుగ్గిరాల వీపీఆర్ సాయి మోహిత్ 64, రెంటచింతలకు చెందిన నల్లబోతు నాగలక్ష్మి 65, మేడికొండూరుకు చెందిన బండ్లమూడి చరితశ్రీ 73, గుంటూరుకు చెందిన నూతక్కి సాత్విక 86వ ర్యాంకు సాధించారు.

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



మా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. ప్రస్తుతం గుంటూరులోనే ఉంటున్నాం. నాన్న శ్రీనివాసరెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ అనురాధ గృహిణి. సీనియర్ ఇంటర్‌లో 971 మార్కులు సాధించా. ఇటీవల తెలంగాణ ఎంసెట్‌లో 2వ ర్యాంకు సాధించాను. ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో కాలేజీలో ఇచ్చిన ప్రణాళిక ప్రకారం రోజుకు 12 గంటల పాటు చదివాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఎదురు చూస్తున్నాను.

– యక్కంటి మణీధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ 7వ ర్యాంకు, గుంటూరు

విదేశాల్లో ఎంఎస్ చదువుతా



మా స్వస్థలం చిలకలూరిపేట. నాన్న హనుమంతరావు రైతు. అమ్మ కళావతి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి. అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకు కైవసం చేసుకుని ముంబై ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధించే లక్ష్యంతో ఉన్నాను. బీటెక్ తరువాత ఎంఐటీలో ఎంఎస్ చదవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను.

– అడ్డగడ్డ వెంకట శివరాం, ఇంజినీరింగ్ 6వ ర్యాంకు, చిలకలూరిపేట

కార్డియాలజిస్టు కావాలన్నదే లక్ష్యం



అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించటం ఆనందంగా ఉంది. తెలంగాణ స్టేట్ ఎంసెట్‌లోనూ ఇదే కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించా. వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన 'నీట్' పరీక్షల్లోనూ 720 మార్కులకు 700 సాధించి, 237వ ర్యాంకును కైవసం చేసుకున్నాను. తెనాలి ఆర్ఆర్ నగర్‌లో మా నివాసం. విజయవాడ గోశాల చైతన్య కాలేజీలో ఇంటర్ చదివాను. కరోనా వల్ల విద్యుత్ శాఖలో పనిచేసే తండ్రి వెంకటరామిరెడ్డి కన్నుమూసినా, ఆయన ఆశయం మేరకు, తల్లి ఉమామహేశ్వరి ఇచ్చిన ప్రోత్సాహంతోనే చదువులో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నాను. మంచి వైద్య కళాశాలలో చదువుకుని కార్డియాలజిస్టుగా గుర్తింపు పొందాలనేది నా ఆశయం.

– దుర్గెంపూడి కార్తికేయరెడ్డి

రైతు బిడ్డకు స్టేట్ 3వ ర్యాంక్



పిడుగురాళ్ల రూరల్: నందిపాటి నారపరెడ్డి, దుర్గమ్మలది రైతుకూలీ కుటుంబం. వీరి కుమారుడు నందిపాటి సాయి దుర్గా రెడ్డి ఏపీ ఈఏపీ సెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్ సాధించాడు. తాను పడుతున్న కష్టం కుమారుడు పడకూడదనే ఉద్దేశంతో నారపరెడ్డి కుమారుడిని విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో హాస్టళ్లలో ఉంచి చదివించారు. తండ్రి ఆశయం మేరకు సాయిదుర్గారెడ్డి కష్టపడి చదివి ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ 3వ ర్యాంక్‌లో నిలిచాడు. తెలంగాణ ఎంసెట్‌లోనూ 18వ ర్యాంకుతో మెరిశాడు. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఎంటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్టు సాయిదుర్గారెడ్డి చెప్పాడు.

చట్టప్రకారం ప్రొసీడ్'

- విత్తన చట్టాలపై అవగాహన అవసరం
- లైసెన్స్ ఉంటేనే ప్రైవేటుగా విత్తనాల విక్రయం
- రశీదు తప్పనిసరిగా పొందాలి
- 2,733 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు



సత్తెనపల్లిలోని విత్తనాల దుకాణంలో తనిఖీలు చేపడుతున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరమవుతున్నాయి. ప్రైవేటు దుకాణాల్లోనూ విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. క్రయవిక్రయాలు అధికంగా జరిగే ఈ సీజన్‌లో రైతులు మోసపోయే అవకాశాలూ ఎక్కువే. విత్తన చట్టంపై అవగాహన పెంచుకుంటే ఎలాంటి అవస్థలూ ఉండవని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చట్టం ద్వారా విత్తనాలు కొనే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటారు. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలను సమ్మిళితం చేసి విత్తన పరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్-ఏ ప్రకారం జరిమానా కూడా విధిస్తారు. జిల్లాలో 2,733 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వాటిలో 420 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 978 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 1,335 మంది పురుగు మందుల విక్రయాల డీలర్లు ఉన్నారు.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి

విత్తన దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8 ప్రకారం దుకాణాల్లో విత్తన విక్రయాలు నిలుపుదల చేస్తారు. అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు రద్దు చేస్తారు.

లేబుల్ లేకపోతే..

ప్రైవేట్ వ్యాపారి వద్ద కొన్న విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం-1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం - 1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు.

నిబంధనలు పాటించాల్సిందే

విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలి. విత్తనాలు ఎంత ఉన్నాయి? ధరలు తెలిసేలా దుకాణంలో బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం పొందు పరిచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఆ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంది.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

- కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే విత్తన చట్టం -1988 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు – 1983 క్లాజు 8 ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్ / రద్దు చేయవచ్చు.

రశీదు ఇవ్వాల్సిందే

విత్తనాలు కొన్న రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సును సస్పెండ్/ రద్దు చేయవచ్చు.

లైసెన్స్ ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. అలా లేకుంటే ఆ దుకాణంలో విత్తనాల విక్రయాలను నిలిపివేయవచ్చు. అంతేకాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్/ రద్దు చేయవచ్చు.

మత్స్యసిరులు ఎగసి పడవ..

తొలివేటపై గంపెడాశలు

- వేటకు బయలుదేరిన బోట్లు
- రెండు నెలల సుదీర్ఘ విరామం తరువాత సంద్రంబాట
- జూన్ 14తో ముగిసిన వేట నిషేధ గడువు
- హార్బర్‌లో సందడి వాతావరణం
- మొగ సామర్థ్యం పెంపుతో మత్స్యకారుల్లో ఆనందం



వేటకు సిద్ధమైన బోట్లు

రేపల్లె: సుదీర్ఘ విరామం తరువాత సముద్రంలో వేటకు గంగపుత్రులు గురువారం నుంచి పయనమవుతున్నారు. మత్స్య సంపద వృద్ధిని దృష్టిలో ఉంచుకుని మార్చి 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు వేటపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో జూన్ 15 నుంచి మత్స్యకారులు తిరిగి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సర్వంసిద్ధం చేసుకున్నారు. బుధవారం ముహూర్తం బాగుండటంతో తమ ఇష్టదైవాలకు పూజలు చేసి గంపెడు ఆశలతో తొలి వేటకు పయనమయ్యారు. ఏటా వేటనిషేధ కాలం ముగిసిన తర్వాత చేసే తొలి వేటలో మత్స్యసిరులు అపారంగా పడతాయని మత్స్యకారుల నమ్మకం. దీంతో హార్బర్ ప్రాంగణం సందడిగా మారింది.

బోట్లకు మరమ్మతులు పూర్తి

వేట నిషేధ సమయంలోనే గంగపుత్రులు బోట్లకు మరమ్మతులు పూర్తి చేసుకున్నారు. రంగులు వేయించారు. వలలను సరిచేసుకున్నారు. వేటకు వెళ్లేందుకు ఉప్పు, ఐస్, తాగునీరు, వంట సామగ్రి, డీజిల్ తదితరాలు సిద్ధం చేసుకున్నారు. వేట నిషేధ సమయంలో వీరికి వైఎస్సార్ మత్స్యకార భరోసా రూ.పదివేలు ఆసరాగా నిలిచింది.

మొగ వద్ద సాఫీగా...

హార్బర్ రెండో దశ పనుల్లో భాగంగా సముద్రంలోకి రాకపోకలు సాగించే మొగ సామర్థ్యం పెంపు చేపట్టడంతో ఆ ప్రదేశంలో బోట్లు సాఫీగా సాగిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నారు. వాస్తవానికి గతంలో మొగ సామర్థ్యం చాలక బోట్ల రాకపోకలకు ఆటంకాలు కలిగేవి. సముద్రంలోకి వెళ్లేందుకు ఎన్నో గంటల సమయం వేచి ఉండాల్సి వచ్చేది. ఒక్కొక్కసారి మొగ వద్ద బోట్ల అడుగు భాగం నేలకు తగిలి అవి దెబ్బతినేవి. హార్బర్ రెండో దశ పనులు చేపట్టడంతో మొగసామర్థ్యం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫలితంగా ఇప్పుడు బోట్లు సాఫీగా రాకపోకలు చేయగలుగుతున్నాయి.

వరాల రేడు సీఎం



హార్బర్ అభివృద్ధికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తొలి నుంచి కృషి చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో మొగ వద్ద ఇబ్బందులు తప్పాయి. సీఎం జగన్ మత్స్యకారుల హృదయాల్లో వరాల రేడుగా చిరస్థాయిగా నిలిచిపోతారు.

– కె.వెంకటేశ్వరరావు(కేవీఆర్), బోటు ఓనర్, నిజాంపట్నం

వేట ఆనందంగా చేసుకుంటాం



నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు వరంగా మారాయి. గతంలో మొగ వద్ద బోట్ల రాకపోకలకు ఆటంకాలు ఉండేవి. ఇప్పుడు తొలగిపోయాయి. ఇది ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమే. ఇక వేట ఆనందంగా చేసుకుంటాం.

– కన్నా శ్రీనివాసరావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, నిజాంపట్నం

సీఎం మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలులను గంగపుత్రులు మరువలేరు. మొగ సామర్థ్యం పెంపు పనులు చేపట్టడం వల్ల మా కష్టాలన్నీ తొలగిపోయాయి. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కృషి ప్రశంసనీయం. వేట ఇక హాయిగా సాగుతుంది.

మోపిదేవి శ్రీనివాసరావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నిజాంపట్నం

ప్రతి రక్తపుబొట్టూ సద్వినియోగం కావాలి

ఎస్పీ రవిశంకర్ రెడ్డి



రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సతీమణి వై.ఉమాదేవి

నరసరావుపేట: రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన ప్రతి రక్తపు బొట్టూ సద్వినియోగమయ్యేలా చూడాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ వైద్య విధాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సతీమణి ఉమాదేవి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు, యువత రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. ఉమాదేవి మాట్లాడుతూ జిల్లా పోలీసు విభాగం రక్తదాన శిబిరానికి సహాయసహకారాలు అందజేయటం గొప్పవిషయమని చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్రతినిధులు, పోలీసు అధికారులు ఎస్పీ దంపతులను సన్మానించారు. 53 ఏళ్ల వయస్సులో 54 సార్లు రక్తదానం చేసిన నరసరావుపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.భక్తవత్సలరెడ్డి, 21సార్లు రక్తదానం చేసిన ఏఎస్ఎస్ కానిస్టేబుల్ ఎల్.శ్రీనివాసరావు, ఆరుసార్లు రక్తదానం చేసిన ఉమెన్ కానిస్టేబుల్ ఐ.కీర్తి, 29 సార్లు రక్తదానం చేసిన గాయత్రి ఎలక్ట్రానిక్స్ యజమాని యన్నం శ్రీనివాసరెడ్డిలను ఎస్పీ, నిర్వాహకులు సన్మానించారు. శిబిరంలో మొత్తం 226 మంది రక్తదానం చేశారు. అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కే చంద్రశేఖర్, డీఎస్పీ కేవీ. మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెడ్‌క్రాసు సొసైటీ వైస్‌చైర్మన్ పీవీఎం. శరత్‌బాబు, కార్యదర్శి మురళి, మేనేజింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలలో నిద్రిస్తుండగా ఆహుతి

- 14నెలల చిన్నారి సజీవదహనం
- రక్షించేందుకు యత్నించిన మరో నలుగురికి గాయాలు
- పెదపాలెంలో భారీ అగ్నిప్రమాదం
- 14 పూరిళ్లు దగ్ధం



సజీవ దహనమై మసిబారిన చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

అచ్చంపేట: పొలాల్లో వృథాగా పడి ఉన్న చెత్తా చెదారాన్ని తగలబెడుతుండగా నిప్పురవ్వలు గాలికి ఎగసి వచ్చి పడటంతో 14 పూరిళ్లు దగ్ధమయ్యాయి. పెదపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో 14 నెలల చిన్నారి సజీవదహనమైంది. మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి ఆనుకుని ఉన్న పొలాలలో వ్యర్థాలను తగలబెట్టే క్రమంలో గాలికి నిప్పురవ్వలు వచ్చి పక్కనే ఉన్న పూరిళ్లపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ముందుగా జెర్రిపోతు వెంకట్రావు ఇంటికి నిప్పు అంటుకుంది. వెంకట్రావు 14 నెలల కుమార్తె పల్లవి ఉయ్యాలలో నిద్రిస్తుండగానే మంటల్లో సజీవ దహనమైంది. చిన్నారిని రక్షించేందుకు తల్లి అనిత, అమ్మమ్మ మేరమ్మ, మరో ఇద్దరు తీవ్రంగా యత్నించినా ఫలితం లేకుండా పోయింది. వారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత అగ్నికీలలు క్షణాల వ్యవధిలో గంటెల శివప్రసాద్, జడ సుందరరావు, నల్లూరి తిరుపతయ్య, నల్లూరి నిర్మల, గంటెల పేరయ్య, జడ నాగేశ్వరరావు, జడ ఏసయ్య, గంటా స్వామి, కోపూరి పోతురాజు, కోపూరి జ్యోతిర్మయి, జడ రామారావు, జడ రవి, నల్లూరి కోటయ్య ఇళ్లకూ పాకాయి. ఆ ఇళ్లూ పూర్తిగా దగ్ధమయ్యాయి. క్రోసూరు, సత్తెనపల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే నష్టం జరిగిపోయింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సర్పంచ్ నెల్లూరి హరిబాబు, మాజీ సర్పంచ్ చంద్రబాబు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108లో సత్తెనపల్లి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం: జేసీ



విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దారు పద్మాదేవితో కలిసి ఘటనాస్థలానికి వచ్చారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. తక్షణ సహాయంగా ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల నగదు, 25కిలోల బియ్యం, కిలో కంది పప్పు, వంట దినుసులు, కూరగాయలు, వంట సామగ్రి అందించారు. అందరికీ ఇప్పుడు ఉంటున్న స్థలంలోనే పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

జూడో జిల్లా జట్లు ఎంపిక



నరసరావుపేటఈస్ట్: తిరుపతిలో ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొనే పల్నాడు జిల్లా జట్టు ఎంపికను బుధవారం డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 45 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో టి.వెంకటేష్ (50కేజీలు), షేక్ అమీర్‌బాషా(55కేజీలు), సీహెచ్.యశ్వంత్‌రెడ్డి(60కేజీలు), ఎండి.సాధిక్(73కేజీలు), జేవీపీ సంజీవ్(81కేజీలు), బాలికల విభాగంలో పి.హిమహర్షవర్ధిని(48కేజీలు), ఎం.డి.అఫ్రా(70కేజీలు) ఎంపికైనట్లు జిల్లా జూడో కార్యదర్శి జి.సాయిరాం తెలిపారు. పోటీలను జిల్లా జూడో సంఘం అధ్యక్షురాలు పి.సునీత, సహాయ అధ్యక్షుడు ఓ.శివకృష్ణ, కోశాధికారి షేక్.సుభానీ, ఎన్ఐఎస్ కోచ్ ఎస్.శిరీష పర్యవేక్షించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణించాలని ఉంది



దుర్గి : ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో మండలానికి చెందిన ఉన్నం అజయ్ రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామానికి చెందిన ఉన్నం పార్వతయ్య వెంకటనరసమ్మ దంపతులు వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. వారి కుమారుడు అజయ్ చిన్నతనం నుంచి చదువుల్లో రాణిస్తున్నాడు. గత వారం రోజుల కిందట వెలువడిన తెలంగాణ ఎంసెట్ ఫలితాలలోనూ 73 ర్యాంకు సాధించి విద్య పట్ల తన అభిరుచిని చాటుకున్నారు. పలువురు గ్రామస్తులు అభినందించారు.

గాంధీనగర్ వాసులకు పట్టాలు పంపిణీ

పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టాల కోసం 32 ఏళ్లుగా ఎదురుచూస్తున్న గాంధీనగర్ వాసుల కలలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం సాకారం చేశారు. లింగంగుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న 22 కుటుంబాలకు వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో స్థలాలు కేటాయిస్తూ ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ప్రకాష్ నగర్ 60 అడుగులరోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లబ్ధిదార్లకు పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీనగర్‌లో 110 కుటుంబాలు నివాసం ఉంటుండగా 1991లో 30 మందికి పట్టాలు మంజూరు చేశారన్నారు. మిగతా వారికి ఎటువంటి పట్టాలు లేకుండానే 32 ఏళ్ల నుంచి నివసిస్తున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ దృష్టికి తీసుకెళ్లి 80 కుటుంబాలకు పట్టాలు మంజూరుచేసి సహకరించాలని కోరామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ తీసుకున్న నిర్ణయంతో 20 కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. మరో 60 మందికి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు గాంధీనగర్ వాసులు ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్టీసీ రవికుమార్, ఆర్కే పెద్దిరెడ్డి, సాని కమ్ము కోటిరెడ్డి, ఇప్పల దానారెడ్డి, కామిరెడ్డి నర్సిరెడి, నాగిరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, పూనూరు కోటిరెడ్డి పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తి హత్య

వివాహేతర సంబంధం ఉందన్న అనుమానం

నాదెండ్ల: వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో అర్ధరాత్రి ఆరుబయట మంచంపై నిద్రిస్తున్న వ్యక్తిపై మరోవ్యక్తి రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన విప్పర్ల వెంకట్రావు (40) గ్రానైట్ కంపెనీలో పనిచేస్తుంటాడు. 20 ఏళ్ల కిందట నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన జయమ్మతో వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. పిల్లల చదువు నిమిత్తం కుటుంబం తరలివచ్చి ఐదేళ్లుగా నివాసం ఉంటూ ఇక్కడి నుండే గ్రానైట్ కంపెనీకి పనికి వెళ్తుంటాడు. మంగళవారం రాత్రి కంపెనీ నుండి తిరిగి వచ్చి భోజనం అనంతరం ఇంటి బయట మంచం వేసుకుని నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో అదే కాలనీకి చెందిన తలమాల వెంకన్న తన భార్యతో వెంకట్రావుకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఇనుప రాడ్డుతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దాడిలో తీవ్ర గాయాలపాలైన వెంకట్రావును స్థానికులు గమనించి ఆటోలో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట డీఎస్పీ మహేష్, చిలకలూరిపేట రూరల్ సీఐ అచ్చయ్య, ఎస్సై ఆవుల భాస్కర్, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించగా, స్వగ్రామమైన తంగేడుమల్లికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యలో వెంకన్నకు మరో ఇరువురు సహకరించినట్లు సమాచారం నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికా ఉన్నత విద్యకు భరోసా

- ప్లస్–2 జూనియర్ బాలికా కళాశాలలు ప్రారంభం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 25 ఏర్పాటు
- ఒక్కొక్క కళాశాలకు ఏడుగురు అధ్యాపకులు
- ఎంపికైన వారికి అదనంగా ఒక ఇంక్రిమెంట్ జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి



ప్లస్–2 జూనియర్ కళాశాల ఎంపికైన యడ్లపాడు జెడ్పీహైస్కూల్

యడ్లపాడు: విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదో తరగతి పూర్తిచేసిన అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో స్థానికంగానే వారికి ఉన్నత విద్యను అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం మండల ప్రాంతాల్లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న హైస్కూళ్లలోనే కళాశాల విద్యను అందించాలనే ఉద్దేశంతో 2022–23 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలలు (ప్లస్–2 స్కూల్స్)ను అందుబాటులోకి తెచ్చినా వీటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది. ఈ విద్యాసంవత్సరం నుంచి సమగ్రంగా అందుబాటులోకి తెచ్చేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లను జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించి వారికి ఒక అదనపు ఇంక్రిమెంట్ అందిస్తూ ప్లస్–2 కళాశాలల్లో అధ్యాపకులుగా ప్రోత్సాహం అందిస్తుంది. ఆయా కళాశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన కాగా స్థానిక విద్యార్థుల డిమాండ్‌ను బట్టి బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్ని ప్రవేశపెట్టింది. సబ్జెక్టుల వారీగా సుశిక్షితులైన ఏడుగురు అధ్యాపకుల చొప్పున నియమించింది.

25 జూనియర్ కళాశాలలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 25 ప్లస్–2 జూనియర్ బాలిక కళాశాలను ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభించింది. జిల్లాల వారీగా..గుంటూరు–1, 2 జిల్లాలో మంగళగిరి(నిడమర్రు), పెదకాకాని (వెనిగండ్ల), ఫిరంగిపురం (మునగపాడు), తాడేపల్లి (వడ్డేశ్వరం), దుగ్గిరాల (ఈమని), గుంటూరు (అంకిరెడ్డిపాలెం), కాకుమాను (చినలింగాయపాలెం), కొల్లిపర (తమ్ములూరు), మేడికొండూరు (పేరేచర్ల), పొన్నూరు (వెల్లలూరు), తాడికొండ(పొన్నెకల్లు), తెనాలి(అంగలకుదురు), వట్టిచెరుకూరు (కొర్నెపాడు), ప్రత్తిపాడు, తుళ్లూరు హైస్కూళ్లు. బాపట్ల జిల్లాలో...కర్లపాలెం(యాజిలి), నగరం (చినమత్తలపూడి), చూండూరు (యడ్లపల్లి), నిజాంపట్నం(అడవులదీవి), వేమూరు(పెరవలి), చెరుకుపల్లి, అమృతలూరు హైస్కూల్స్. పల్నాడు జిల్లాలో...పెదకూరపాడు(75 తాళ్లూరు), యడ్లపాడు, శావల్యాపురం హైస్కూళ్లలో ప్లస్–2 జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు.

బాలికలకు ఎంతో మేలు



జూనియర్ కాలేజీని ఏర్పాటుచేసి మండల ప్రజల చిరకాల కోరిక రాష్ట్ర ప్రభుత్వం నేర్చడం సంతోషంగా ఉంది. ఈ ఏడాది బైపీసీలో మా పాప సనిఫాను చేర్పించాను. మండలంలో పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లల్ని చిలకలూరిపేట, గుంటూరు పట్టణాల్లోని కాలేజీల్లో చేర్పించాల్సి పరిస్థితి. దూరం, అక్కడ వసతులు కల్పనకు ఆర్థిక భారం ముఖ్యంగా బాలికల భద్రత గురించి ఆలోచించి పేరెంట్స్ ఆడపిల్లల్ని పదితోనే ఆపేస్తున్నారు. ఇలా వారి ఉన్నత విద్యకు బ్రేక్ పడుతుంది. ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న ఈ నిర్ణయం 98శాతం గ్రామీణ ప్రాంతాల్లోని బాలకలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఆయనకు మా పిల్లలే కాదు పేదకుటుంబాలన్నీ రుణపడి ఉంటాయి.

– రిహానా, విద్యార్థిని తల్లి యడ్లపాడు

35 బృందాలతో విద్యుత్ తనిఖీలు

నిజాంపట్నం: బాపట్ల విద్యుత్‌శాఖ డీఈ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిజాంపట్నం మండలంలో 35 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 94 కేసులు నమోదు చేసి రూ.5లక్షల 31వేల అపరాధ రుసుం జరిమానా విధించారు. సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని విజిలెన్స్ డీఈ కేవీఎల్ మూర్తి కోరారు.

ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో విట్ అకాడమి విద్యార్థుల ప్రతిభ



జె.శైలేష్



సయ్యద్ అఫ్రోజ్

నరసరావుపేటరూరల్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో విట్ అకాడమి విద్యార్థులు సత్తా చాటారు. అకాడమి విద్యార్థి జే.శైలేష్ 167వ ర్యాంకు, సయ్యద్ అఫ్రోజ్ 237వ ర్యాంక్‌ను సాధించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి ఉన్నత ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు రాజారెడ్డి, దోగిపర్తి శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, రంగారావులు అభినందించారు. పటిష్టమైన ప్రణాళిక, నిర్దిష్టమైన పరీక్షా విధానం, అధ్యాపకులు, యాజమాన్యం నిరంతర దీక్ష కారణంగానే ఉన్నత ర్యాంక్‌లు సాధించినట్టు విద్యార్థులు తెలిపారు.

పొంగు, తట్టు రాకుండా చూడండి

కమిటీ సభ్యులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



కరపత్రం ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు

నరసరావుపేట: జిల్లాలో మీజిల్స్ రూబెల్లా (పొంగు, తట్టు) వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో మీజిల్స్ రూబెల్లా ఎలిమినేషన్ డిసెంబర్–2023పై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వినియోగిస్తున్న వ్యాక్సిన్ గురించి కమిటీ సభ్యులకు వివరించారు. కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, అదనపు డీఎండీహెచ్ఓ డాక్టర్ కే.పద్మావతి, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా పంచాయతీ ఆఫీసర్, జిల్లాలోని వివిధ మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి విధానం పక్కాగా అమలుచేయండి

నరసరావుపేట: పరిశ్రమను ప్రారంభించాలనుకునే నిజమైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020–23ను పక్కాగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీకి సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి కల్పన పెరుగుతుందన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధానం 2015–20, 2020–23, ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం (పీఎంఈజీపీ), సూక్ష్మ చిన్నసంస్థలు, క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, జిల్లాలో పారిశ్రామిక పార్కులో ప్లాట్ల కేటాయింపు తదితర పథకాల కింద ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం అందజేసి పారిశ్రామిక వృద్ధిని పెంచాలన్నారు. ఈ మాసంలో వచ్చిన 145 దరఖాస్తులకుగాను 125 ఆమోదించబడ్డాయన్నారు. రవాణా వాహనాలను కొనుగోలుచేసిన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మూలధన రాయితీ కింద అందుకున్న 11దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.వెంకటేశ్వరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపీకృష్ణ, వివిధశాఖల అధికారులు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

500 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

చేబ్రోలు: నకిలీ బిల్లులతో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 500 బస్తాల పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అధికారుల స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారుల కథనం ప్రకారం తెనాలి వైపు నుంచి గుంటూరుకు లారీలో రేషన్ బియ్యం వస్తున్నట్లు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. రీజనల్ విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు తదితరులు చేబ్రోలు మండలం నారాకోడూరు సెంటర్ వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. తెనాలి నుంచి గుంటూరు వైపు వస్తున్న లారీలో ఉన్న బియ్యంకు సంబంధించి బిల్లులను పరిశీలించగా చెరుకుపల్లి మండలం నడింపల్లి ప్రాంతంలోని లలితా ట్రేడర్స్ యజమాని కారుమూరు సత్యనారాయణ, భాస్కరరావులకు చెందినవిగా గుర్తించినారు. ప్లాస్టిక్ బస్తాలలో పేదలకు అందజేసే పీడీఎస్ బియ్యంను చెరుకుపల్లి మండలం నుంచి గుజరాత్ రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విజిలెన్సు అధికారులు చెరుకుపల్లిలో తనిఖీలు చేయగా సంస్థకు సంబంధించి ఏ విధమైన లైసెన్స్, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రసీదులు, రికార్డులు ఏమీ లేనట్లు నిర్ధారించారు. విజిలెన్స్ అధికారుల విచారణలో కారుమూరు సత్యనారాయణ చెరుకుపల్లి చుట్టు ప్రక్కల గ్రామముల నుంచి పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంను సేకరించి, నకిలీ బిల్లులతో అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. లారీలోని 500 ప్లాస్టిక్ బస్తాలలో ఉన్న 250 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యంను స్వాధీన చేసుకున్నారు. యజమాని పై 1955 నిత్యావసరాల చట్టం ప్రకారం 6(ఏ), క్రిమినల్ కేసులు నమోదు చేయవలసినదిగా స్థానిక సీఎస్‌డీటీ భువనేశ్వరిని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ ఎ. శ్రీహరిరావు, తహసీల్దార్ కె.నాగమల్లెశ్వరరావు, స్థానిక సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సత్తా చాటిన వినుకొండ విద్యార్థులు





30వ ర్యాంక్ సాధించిన వెలమకన్న సాత్విక్ | 78వ ర్యాంక్ సాధించిన పోతిన మాధవ్

వినుకొండ(నూజెండ్ల) : ఏపీ ఎంసెట్ ఫలితాల్లో వినుకొండకు చెందిన విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. వినుకొండ పట్టణానికి చెందిన గాయత్రి స్కూల్ నిర్వాహకులు వి.వి.శర్మ, నాగపద్మిని కుమారుడైన సాత్విక్ ఎంసెట్‌లో 147.5 మార్కులు సాధించి 30వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. 1వ తరగతి నుంచి 7 వరకు గాయత్రి స్కూల్‌లో విద్యను అభ్యసించి, 10 తరగతి, ఇంటర్ తెలంగాణలో పూర్తిచేశాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయినీగా పనిచేస్తున్నారు. వినుకొండ పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన వేణుగోపాల్, శిరీష దంపతుల కుమారుడైన పోతిన మాధవ్ ఏపీ ఎంసెట్ ఫలితాల్లో 78వ ర్యాంక్ సాధించాడు. 10వ తరగతి వరకు వినుకొండ గాయత్రి పాఠశాలలో విద్యను అభ్యసించి అనంతరం విజయవాడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. తండ్రి వేణుగోపాల్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. వినుకొండ పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో కిరాణా కొట్టు నిర్వాహకులు తుమ్మలపల్లి పెద్దసుబ్బారావు, సుజాత దంపతుల కుమారుడు వెంకటపవన్‌కుమార్ ఏపీ ఎంసెట్‌లో 192వ ర్యాంక్ సాధించాడు.



తల్లిదండ్రులతో 190వ ర్యాంకర్ వెంకటపవన్‌కుమార్

పేదింటి విద్యా కుసుమం



లక్ష్మీప్రసన్న

మాదల(ముప్పాళ్ల): ప్రతిభకు ఏది అడ్డు కాదని నిరూపించింది మాదల గ్రామానికి చెందిన చెరుకూరి మహంకాళరావు, సుభాషిణిల కుమార్తె లక్ష్మీప్రసన్న. వీరిది వ్యవసాయ కుటుంబం. మొదటి ప్రయత్నంలోనే వైద్య విద్య ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనపరిచి సీటు సాధించటంతోపాటుగా బుధవారం విడుదలైన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 122.5913 మార్కులతో రాష్ట్రస్థాయిలో 224వ ర్యాంకుతోను, పల్నాడు జిల్లాస్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. మొదటి ప్రయత్నంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష(నీట్)లో 582 మార్కులు సాధించింది. లక్ష్మీప్రసన్న పదో తరగతి పరీక్షల్లోను 581 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 978 మార్కులు సాధించింది. కళాశాలలో ఇచ్చిన శిక్షణతోనే ఈ మార్కులు సాధించటం విశేషం. తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలకు హాజరై రాష్ట్ర స్థాయిలో 548వ ర్యాంకు సాధించింది. లక్ష్మీప్రసన్నను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

ఎండుగుంపాలెం విద్యార్థికి 158వ ర్యాంకు



విద్యార్థి మౌర్యనందన్

నాదెండ్ల: ఉపాధ్యాయుల కుటుంబంలో విద్యా కుసుమం విరిసింది. మండలంలోని ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన అమృతపూడి మౌర్యనంద ఏపీఈఏపీ సెట్–2023 ఫలితాల్లో 137 మార్కులతో 158వ ర్యాంకు సాధించాడు. మౌర్యనంద తల్లిదండ్రులు కిరణ్ వరప్రసాద్ వినుకొండ సమీపంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, తల్లి సువర్ణలత వితలరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. విద్యార్థి మౌర్యనంద మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవాడు. 1–5 వరకూ ప్రైవేటు పాఠశాలలో చదవగా, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ గుంటూరు భాష్యంలో విద్యనభ్యసించాడు.

మద్రాస్ ఐఐటీలో చదవాలన్నదే నా లక్ష్యం



శ్రీవిఘ్నేష్

అమరావతి(పెదకూరపాడు): జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించి మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదవాలన్నదే లక్ష్యమని ఏపీఈఏపీ సెట్‌లో 64వ ర్యాంక్ సాధించిన మిడమనేని శ్రీవిఘ్నేష్ తెలిపారు బుధవారం ప్రకటించిన ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 64వ ర్యాంక్ సాధించాడు. 7వ తరగతి వరకు పెదకూరపాడులోను, అనంతరంగుంటూరులో చదివాడు. జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా స్థాయిలో 665ర్యాంక్, ఈడబ్ల్యూ ఎస్ కోటాలో 62వ ర్యాంక్ సాధించాడు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో కూడా 200లోపు ర్యాంక్ సాధిస్తానని విఘ్నేష్ తెలిపారు. శ్రీవిఘ్నేష్ తల్లిదండ్రులు అంజనేయులు, శ్రీలక్ష్మిలు ఆనందం వ్యక్తం చేశారు. అంజనేయులు ప్రైవేటు విద్యా సంస్థలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

పోలీసు గస్తీ ముమ్మరం చేయాలి

- ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశం
- వేర్వేరు ప్రాంతాల్లో అర్ధరాత్రి పర్యటన



స్థానిక మహిళతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. మంగళవారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, హిందూ కళాశాల కూడలి, నగరంపాలెం పీఎస్ పరిధిలోని శ్రీనివాసరావుపేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆర్టీసీ ప్రయాణికులు, స్థానిక మహిళలతో ఎస్పీ మాట్లాడారు. పోలీసుల గస్తీపై వారిని ఆరా తీశారు. ఎస్పీ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ రాత్రిళ్లు గస్తీ నిర్వహించే పోలీస్ అధికార, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుట్‌పాత్ పెట్రోలింగ్ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ప్రతిరోజూ రాత్రి నుంచి ఉదయం వరకు పహారా నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చూడాలని చెప్పారు. రహదారి ప్రమాదాల నివారణకై చర్యలు తీసుకోవాలని అన్నారు. దక్షిణ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐలు బి.నరసింహరావు, బెల్లం శ్రీనివాసరావు ఉన్నారు.